గడ్డివామి దగ్ధం

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో బుధవారం రైతు రాముడుకు చెందిన గడ్డివాము నిప్పు అంటుకుని దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తి బీడీ తాగి పడేయడంతో వామిదొడ్డిలో కుప్పపెట్టిన పశుగ్రాసానికి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పత్తికొండ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. పశుగ్రాసం కాలిపోవడంతో రూ.40 వేల దాకా నష్టం వాటిల్లినట్లు ఎస్ఎఫ్ఓ దినకర్‌బాబు తెలిపారు.



సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మద్దికెర: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జగనన్న కాలనీలో రూ.51 లక్షలతో 40 వేల లీటర్ల కెపాసిటీతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పరిపాలన చేస్తున్నారన్నారు. ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలు చేయిస్తున్నారన్నారు. గతంలో కాలనీలు ఏర్పాటు చేసిన కొన్నేళ్లకు గానీ సదుపాయాలు కల్పించేవారు కాదన్నారు. అయితే సీఎం జగనన్న కాలనీల పేరిట గ్రామాలే నిర్మించడమే గాకుండా విద్యుత్, నీటి సౌకర్యం, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే మద్దికెరలోని జగనన్న కాలనీలో ఓహెచ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, సర్పంచులు మల్లికార్జున, విజయుడు ఉపసర్పంచ్ గోపాల్, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, నాయకులు రామలింగారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెరవలిలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

వెల్దుర్తి: స్థానిక 14వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఆ కాలనీవాసులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ చిట్టెమ్మ, రాజు దంపతుల నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేను కాలనీవాసులు పూలమాలలతో ముంచెత్తారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తమ ఇబ్బందులు తెలుసుకుని కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, దేవరాజ్ తదితరులు ఉన్నారు.

హంద్రీ-నీవా నీటి మళ్లింపుతో కరువు దూరం

తుగ్గలి: హంద్రీ-నీవా ద్వారా చెరువులకు నీటిని మళ్లిస్తుండడంతో కరువు దూరమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పైపులైన్ ద్వారా రాతన చెరువులోకి పారుతున్న నీటిని వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాచప్ప, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, యువ నాయకులు ఉమామహేశ్వర రెడ్డి బుధవారం పరిశీలించి గంగమ్మ పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో ఎంతో మంది పాలకులు చెరువులకు నీళ్లిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారే తప్ప హామీని నిలబెట్టుకోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషితో మండలంలో అన్ని చెరువులకు నీటి మళ్లింపు కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. నీటి మళ్లింపుతో ఆయకట్టు సాగుతో పాటు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య తీరుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, కోదండ, బసవరాజు పాల్గొన్నారు.


రాతన చెరువులోకి పారుతున్న నీటిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు





